శ్రీ రచన :

# కాలక్షేపం

జి. ఎస్. దేవి

★

ఇదిగో, ఇదిగో- ప్రారంభిస్తున్నా.

"తల్లీ! నిన్ను తలంచి పుస్తకము చేతన్ బూనితిన్, నీవు నా...."

అయితే, వెంకమ్మగారు, రుక్మిణమ్మగారు రాలేదేం ఇవాళ

యేమిటో వాళ్లింట్లో జగడమటండీ.

యేమిటీ జగడమూ, యెవరెవరికీ, అత్తా కోడలికేనా?

: మరేమనుకొన్నారు, నిన్న మొగుడూపెళ్లాం సినిమాకెళ్ళడానికి బయలుదేరారట. రుక్మిణమ్మగారు దేవళంలోకెళ్ళాల, లక్షదీపారాధన, రేపు వెళ్ళవచ్చు సినిమా కందిట- కోడలు కొడుకు లక్ష్యపెట్టకుండా వెళ్ళారట. ఇదే కారణం, జగడానికీ.

ఈ కాలపువాళ్ళ వరస ఇంతేనండీ, యేమిటో పెద్దామె వద్దందిగదా అని ఇంట్లో వుంటే. యేం పోయిం దావిడకు, కొడుకూ సరే. తల్లిమాట లక్ష్యంలేకుండా పిలుచుకొని వెళ్ళడమేమిటీ.

ఏమండీ సుబ్బమ్మగారు మీ మనమరాలికి మళ్ళా పెండ్లి చేస్తారటగా, నిజమేనా ?

ఏమిటో పోనిద్దురూ, మనకెందుకండీ ఈ గొడవలు. వృధా కాలయాపన. కృష్ణా రామా అనుకోకుండా. చదువుతా వినండీ

"యిల్లింబందున నిల్చి జృంభణముగా, నుక్తుల్, సుశబ్దంబుల్ "

ఓహో, మీనాక్షమ్మగారా రాండి, రాండి, దారి తప్పి వచ్చారే.

అబ్బే దారి తప్పడమేమిటండి. రావలసే వచ్చా.

ఈ మధ్య బొత్తిగా మానుకొన్నారే రావడం. యేమిటోనండి, ఇంట్లో బొత్తిగా తీరడంలేదు యేం చెయ్యను.

అదేమిటండీ కోడలుండిగా ఇంట్లో, పనీ పాటూ చూచుకోను కొంచెంసేపైనా కృష్ణా రామా అని కాలక్షేపం చెయ్యకుంటే యెల్లాగండీ. యెప్పుడూ వుండేదీగా సంసారపు గొడవ. ఇంకా మనకెందుకండీ ఆ గొడవ.

యేందోనండీ వెంకమ్మగారూ, కోడండ్లు కోడండ్లనడమే గానీ. ఈ కాలం కోడండ్లు పన్లు చేస్తారా ? యెంతసేపూ వాండ్లు దువ్వుకోవడం. పిన్నులు గుచ్చుకోవడం. పవుడరా ? యేమిటో సున్నంలాగా వుంటుంది, అది పూసుకోడం, ఆ చీరలేమిటి సన్నగా వళ్ళంతా కనపడుతూ గూడ కట్టు, లోపల షావళ్లు, రవికలా గౌనులా ? అవి యేమిటో, బుజాలమీద కొండమాదిరి ఇంతెత్తు నుంటాయి. లోపల బాడీలట, యేమిటో వేషం వేసుకొన్నట్టుంటుంది. ఈ అలంకారాలు చేసుకొని చెప్పులు వేసుకొని మొగవాండ్లతోపాటు షికార్లు కొట్టడానికే సరిపోతుంది వాండ్లకు పొద్దు. అయ్యో ఇదేమిటి రామాయణంలో పిడకల వేట్లాటలాగా ? కానీండి చదవండి ఇప్పుడు కధ యే పట్టులో వుందీ?

కృష్ణలీలలండీ, ఆ కృష్ణపరమాత్మ వున్నాడే. ఆ భగవంతుడి లీలలు, యేమి హాయిగా వుంటాయండీ. ఈ కాలపువాళ్ళకు పురాణం, భగవధ్యాన్నం గిట్టదు కదా ? యెంతసేపైనా సినిమాలు, డానుసులు, పాటకచ్చేరిలు, క్లబ్బులు యేమిటో పైగా చూచారూ, మొగాడితో సమానంగా చీట్లాడటం, బ్యాటాటా, యేమిటో చేతిలో కొయ్యలాటిది పట్టుకొని యెగిరెగిరి ఆడతారే, యేం కాల విపరీతమండీ.

ఇది విన్నారా? సుబ్బమ్మగారు, మొన్న రాధమ్మగారి కోడలు మాలవాళ్లనందరినీ వెంటేసుకొని శివాలయానికి వెళ్ళిందట. అక్కడి కెవరెవరో మంత్రులంతా వచ్చారట, ఆవిడకు పూల హారాలు వేసి మంత్రులతోపాటు మర్యాద చేశారట, వాళ్ళతోటి వూరంతా వూరేగిందట, చూచారటండీ అత్తింటికోడలు ఇల్లా తిరగడం మన కాలంలో యెప్పుడన్నా విన్నామటండీ.

ఆవిడ అలా అందరితో తిరుగుతుంటే, ఆ మొగుడెల్లా వప్పుకున్నాడమ్మా సిగ్గులేకా, ఇంట్లో పడుంటావా లేదా అని రెండు బాదక.

వాడల్లా అనేటట్టుంటే ఆవిడ యెందుకల్లా ఆడుతుంది, వాడు భార్య వెంటనే వుండి ఆవిడకు మర్యాద చేస్తుంటే పుబ్బితబ్బిబ్బయినాడట, ఇప్పటి చదువుకున్న పిల్లల వరసంతా ఇంతేనండీ.